క్లుప్తంగా

అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజలో పాల్గొన్న నాయకులు, అధికారులు

పెద్దకడబూరు: మండలంలోని నౌలేకల్లు గ్రామంలో పంచాయతీ రాజ్ ఏఈ మల్లయ్య ఆధ్వర్యంలో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి శుక్రవారం భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ నాడు – నేడు కింద అంగన్‌వాడీ భవన నిర్మాణానికి రూ. 12.5లక్షలు మంజూరయ్యాయన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కాత్యాయని, నాయకులు వీరుపాక్షి, సురేష్, జాము మూకయ్య పాల్గొన్నారు.

ఉపాధి వేతనాలు చెల్లించాలి

ఆదోని రూరల్: ఉపాధి హామీ కూలీలు చేసిన పనికి 8 వారాల వేతనాలు పెండింగ్‌లో ఉన్నా యని వాటిని వెంటనే చెల్లించాలని ఏపీ వ్యవ సాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గణేకల్, దొడ్డనగేరి, గ్రామ సచివాలయాల ఎదుట శుక్రవారం ఆందోళన నిర్వహించారు. అనంతరం ఆయా సచివాలయాల కార్యదర్శులకు వినతి పత్రం అందజేశారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.లింగన్న మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో కూలీలకు గిట్టుబాటు వేతనం అందడం లేదన్నారు. చేసిన పనికి వేతనాలు ఇవ్వకపోతే వలసలు ఎలా ఆగుతాయని ప్రశ్నించారు.ఉపాధి పనులు చేసినా రూ.200కు మించి కూలి రావడం లేదని, ఉపాధి వేతనం రూ. 600కు పెంచాలని డిమాండ్ చేశారు.సంఘం మండల అధ్యక్షుడు రంగన్న, మండలకమిటీసభ్యులు గోవిందు,ఈరన్న పాల్గొన్నారు.

బాలికల హాస్టల్ ఏర్పాటు చేయాలి

కోసిగి: జిల్లాలోనే వెనుకబడిన కోసిగి ప్రాంతంలో బాలికల విద్యాభివృద్ధి కోసం బాలికల హాస్టల్ ఏర్పాటు చేయాలని ఏఐఎస్‌ఎఫ్ తాలూకా కార్యదర్శి వీరేష్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి ఏటా డిసెంబర్, జనవరి నెలల్లో అధిక సంఖ్యలో కూలీలు వలసలు వెళ్తారని, ఈ క్రమంలో తమతో పాటు వారి పిల్లలను బడి మాన్పించి తీసుకెళ్తున్నారన్నారు. దీంతో బాలికల చదువు అర్ధాంతరంగా నిలిచిపోతుందని, దీన్ని అరికట్టాలని బాలికలకు హాస్టల్ ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే బాలికల జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలలు కూడా ఏర్పాటు చేస్తే మరింత మంది ఉన్నత విద్యనభ్యసించడానికి వీలుంటుందని పేర్కొన్నారు. నాయకులు మహేష్, మల్లికార్జున, రామాంజనేయులు, నరసింహులు, ఉలిగయ్య పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

మంత్రాలయం రూరల్: మండలంలోని తుంగభద్ర గ్రామంలో నిల్వ ఉంచిన 33 ప్యాకెట్లు దాదాపు 10 క్వింటాళ్ల రేషన్ బియ్యంను పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఎరుకల నాగేంద్రపై కేసు నమోదు చేసినట్లు మాధవరం పోలీసులు తెలిపారు.

గాయత్రీ మాతకు ప్రత్యేక పూజలు

ఆస్పరి: ఆస్పరి సమీపంలోని రామతీర్థంలో వెలసిన గాయత్రీ మాత ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో నిర్వాహకులు రూపామోహన్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, హోమం, మంగళ హారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఉప్పరహాల్‌లో కబడ్డీ పోటీలు

కౌతాళం: మండలంలోని ఉప్పరహాల్ గ్రామంలో మారికాంబ దేవి జాతర సందర్భంగా కబడ్డీ పోటీలు ఏర్పాటు చేశామని నిర్వహకులు మహేశ్, తరసాలప్ప, రేవణసిద్ధ తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ఫిబ్రవరి-2న గ్రామంలో జాతర ఉంటుందని, ఈనెల 29వ తేదీ లోపు ప్రవేశ రుసుం రూ.400 చెల్లించి పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈనెల 31న పోటీలు ప్రారంభమవుతాయని, ఫిబ్రవరి 2న ఫైనల్ పోటీ ఉంటుందని చెప్పారు. విజేత జట్టుకు రూ.12వేలు, రన్నర్‌కు రూ.6వేల నగదు బహుమతిగా అందజేస్తామని పేర్కొన్నారు.

పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మిగనూరురూరల్: విద్యార్థులపై ఒత్తిడి పెంచుతున్న కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని రాయలసీమ పరిరక్షణ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు షాహిద్‌అఫ్రిద్ డిమాండ్ చేశారు.ఆయన శుక్రవారం మాట్లాడుతూ ఇప్పటి నుంచే 9వ తరగతి విద్యార్థులకు పదో తరగతి సిలబస్ బోధిస్తూ మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారని, అలాగే ఉదయం 7 గంటల నుంచి రాత్రి 7 వరకు క్లాసులు తీసుకుంటున్నారన్నారు. ఇలాంటి పాఠశాలలపై విద్యాధికారులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

క్రీడాకారుడికి అభినందన

తుగ్గలి: మూడు రోజుల క్రితం కర్నూలులో నిర్వహించిన రాష్ట్రస్థాయి వాలీబాల్ అండర్-17 విభాగం పోటీల్లో కర్నూలు జట్టు తరపున మండల పరిధిలోని ఎల్లమ్మగుట్ట తండాకు చెందిన అంజినాయక్ పాల్గొని సత్తాచాటాడు. ఈ మేరకు శుక్రవారం క్రీడాకారుడిని పలువురు అభినందించారు. జొన్నగిరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న అంజినాయక్ ప్రతిభతో కర్నూలు జట్టు మూడో స్థానంలో నిలిచిందని గిరిజన నాయకులు అశోక్‌నాయక్, పీఎంసీ చైర్మన్ రఘు తెలిపారు.

మూగజీవాలకు మెరుగైన వైద్యం

ఆదోని రూరల్ : మూగజీవాలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యసేవలు అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్యసేవా వాహనాలను ప్రవేశ పెట్టారని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నియోజకవర్గంలోని మదిరె గ్రామానికి సంబంధించిన సంచార పశు ఆరోగ్య సేవా వాహనాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు 108 ద్వారా అత్యవసర సేవలు అందుతున్నాయో, అలాగే మూగజీవులకు కూడా సంచార పశు ఆరోగ్యసేవా వాహనాల ద్వారా సేవలు అందించాలనుకోవడం అభినందనీయమన్నారు. టోల్‌ఫ్రీ నంబర్ 1962కు ఫోన్ చేయగానే సంచార ఆరోగ్యసేవా వాహనాలు రైతు వద్దకు వచ్చి పశువుకు వైద్య సేవలందిస్తారని చెప్పారు. వాహనంలో ప్రథమ చికిత్స, వ్యాధి నిర్ధారణ, వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ, చిన్నతరహా శస్త్ర చికిత్సలతో పాటు కృత్రిమ గర్భధారణ తదితర వైద్యసేవలు అందుతాయన్నారు. వాహనంలో ఓ పశువైద్యుడు, ల్యాబ్ టెక్నీషియన్, కాంపౌండర్, డ్రైవర్, అటెండర్ ఉంటారని తెలిపారు. ఆదోని డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ ఆదోని డివిజన్‌లో ఇప్పటికే మొదటి విడతలో ఆదోని, ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో సేవలను ప్రారంభించామన్నారు. ఇప్పటివరకు డివిజన్‌లో 248 గ్రామాల్లో 3,477 పశువులకు వైద్యసేవలు అందించామని, రెండో విడతలో మదిరె, ఆస్పరి, కోసిగి, గోనెగండ్ల, కృష్ణగిరి గ్రామాల్లో ఉన్న పశువైద్య కేంద్రాలకు వాహనాలను కేటాయించామని వివరించారు.



సంచార పశు వాహనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యేతో పశువైద్య సిబ్బంది



పశుఆరోగ్య సేవా రథాన్ని ప్రారంభిస్తున్న వై.ప్రదీప్‌రెడ్డి

మంత్రాలయం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు మెరుగైన సేవలందిస్తుందని వైఎస్సార్‌సీపీ నేత వై.ప్రదీప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నియోజకవర్గానికి మంజూరైన డాక్టర్ వైఎస్సార్ పశుఆరోగ్య సంచార రథాన్ని ఎమ్మిగనూరు పట్టణంలోని భీమా నిలయం వద్ద ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పురుషోత్తరెడ్డి, పీఏ వెంకట్రామిరెడ్డి, వైద్యాధికారులు ఉన్నారు.

డంపింగ్ యార్డులో మళ్లీ మంటలు

హొళగుంద: స్థానిక పెద్ద చెరువు వద్ద ఉన్న సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్ (చెత్త సేకరణ కేంద్రం) వద్ద నిల్వ చేసిన చెత్త దిబ్బలకు మళ్లీ మంటలు చెలరేగాయి. 10 రోజుల క్రితం అవే చెత్త దిబ్బలకు అంటుకున్న మంటలను అప్పట్లో ఆర్పివేశారు. శుక్రవారం అదే ప్రాంతంలో తిరిగి మంటలు చెలరేగడంతో పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు పంపాపతి వాటర్ ట్యాంకర్‌తో మంటలు ఆర్పేందుకు చర్యలు చేపట్టి ఆలూరు ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. వారు వాహనంతో వచ్చి మంటలు వ్యాపించకుండా చర్యలు చేపట్టారు. ఇదిలా ఉండగ షెడ్ పరిసరాల్లో స్థానిక రైతులు పదుల సంఖ్యలో గడ్డివాములు వేసుకున్నారు. అక్కడే ఉన్న చెత్త దిబ్బలకు తరుచూ మంటలు అంటుకుంటుండడంతో అధికారులకు తలనొప్పిగా మారింది. ప్రమాదవశాత్తు మంటలు అంటుకుంటున్నాయా? ఎవరైనా ఉద్దేశపూర్వకంగ నిప్పు పెడ్తున్నారా? అని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు మాత్రం గడ్డివాములకు ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోకుండా శ్రమిస్తున్నారు.

నేడు శ్రీనివాసుడి కల్యాణం



గరుడసేవకు ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

ఆదోని అర్బన్ : పట్టణ శివారులోని తిరుమలనగర్‌లో వెలిసిన శ్రీ పద్మావతి వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో రథసప్తమి సందర్భంగా శనివారం శ్రీనివాస కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ మేనేజర్ ఈరన్న శుక్రవారం తెలిపారు. శ్రీ తిరుమల సేవాసమితి ఆధ్వర్యంలో అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడైన శ్రీనివాసుడు, జగన్మాత పద్మావతి అమ్మవారి కల్యాణం మధ్యాహ్నం 12 గంటలకు సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తామని చెప్పారు. పద్మావతి అమ్మవారికి శ్రీభద్రావతిభావన రుషి దేవాలయం వారు పట్టువస్త్రాలు సమర్పిస్తారని పేర్కొన్నారు.

గరుడ సేవకు ఏర్పాట్లు..

పట్టణంలోని కోట వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీవారి గరుడ వాహన సేవ నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. శ్రీలక్ష్మీ వేంకటేశ్వర భక్తబృందం ఆధ్వర్యంలో ఆలయంలో వెలిసిన పద్మావతి, వేంకటేశ్వరస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఉత్సమూర్తులను గరుడ వాహనంపై ఆశీనులు గావించి అభయాంజనేయ స్వామి ఆలయం నుంచి ప్రధాన రహదారి గుండా కోట వేంకటేశ్వర స్వామి ఆలయ వరకు ఊరేగించనున్నారు. వేడుక అనంతరం గరుడ విశిష్టత గురించి సుస్వరం నాగరాజ ఆచార్యులు ప్రవచనాలు వినిపిస్తారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవ, లక్షార్చన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

వైఎస్సార్‌సీపీలో చేరిక

ఆదోని అర్బన్ : మండలంలోని పెద్దతుంబళం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సీనియర్ నాయకుడు కొండా హనుమంతరెడ్డి ఆధ్వర్యంలో పది కుటుంబాలు పార్టీలో చేరాయి. ముందుగా టీడీపీ ముఖ్య నాయకులు హనుమంతరెడ్డి, సంజీవరెడ్డితో పాటు మరో 8 కుటుంబాల సభ్యులు నాగరాజు, రాంభీంనాయుడు, బాలరాజు, గోవిందు, రాజు తదితరులకు ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ నాయకులు మాట్లాడుతూ 15 ఏళ్ల నుంచి టీడీపీలో ఉన్నా ప్రజలకు న్యాయం చేయలేకపోయామని చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను తమకు కూడా అందించాడని చెప్పారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, నవరత్నాలు, సంక్షేమ పథకాలతో ఎందరికో మేలు జరిగాయని, వాటిని మెచ్చి పార్టీలోకి చేరుతున్నట్లు తెలిపారు. సర్పంచ్ ఉచ్చీరప్ప పాల్గొన్నారు.

ఎడిసన్ సేవలు మరువలేనివి

ఆలూరు రూరల్: విద్యుత్ బల్బును కనుగొన్న థామస్ అల్వా ఎడిసన్ సేవలు మరువలేనివని ఆలూరు మండల లేబర్ ఆఫీసర్ కనక మహాలక్ష్మి, ఎస్‌ఐ డాక్టర్ నాయక్ అన్నారు. శుక్రవారం స్థానిక వాసవీ కల్యాణ మండపంలో యూనియన్ ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్ డే నిర్వహించి జెండాను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. ఎడిసన్ విద్యుత్ బల్బు కనిపెట్టి ప్రపంచానికి కాంతిని అందించారన్నారు. ప్రైవేటు విద్యుత్ కార్మికులందరూ ఈ–శ్రమ్ కార్డులను పొందాలని, ఏదేని ప్రమాదం జరిగితే ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందుతుందన్నారు. ఆధార్ కార్డుతో గ్రామ సచివాలయాల్లో సంప్రదిస్తే ఉచితంగా ఈ–శ్రమ్ కార్డును అప్లై చేస్తారన్నారు. అలాగే ఎస్‌ఐ నాయక్ మాట్లాడుతూ.. విద్యుత్ పరికరాల మరమ్మతులు చేసేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అంతకు ముందు థామస్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ప్రైవేట్ ఎలక్ట్రికల్ యూనియన్ సభ్యులు తహసీల్దార్ మల్లికార్జునకు సమస్యలతో కూడిన వినతి పత్రం అందించారు.



ఎడిసన్ చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం మాట్లాడుతున్న ప్రైవేటు ఎలక్ట్రికల్ కార్మికులు

సీపీఐ పోరుబాట పోస్టర్ విడుదల

హొళగుంద: సీపీఐ పోరుబాట పేరిట ఫిబ్రవరి 6న కర్నూలు కలెక్టరేట్, 22న విజయవాడలో చేపట్టే మహా ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి గజ్జెళ్లి కాళాప్పాచారి కోరారు. శుక్రవారం హొళగుందలో పోరుబాటకు సంబంధించి పోస్టర్లను విడుదల చేసారు. ఈ సందర్భంగా కాళాప్పాచారి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఇంటి నిర్మాణాలకు ఇస్తున్న ప్రోత్సాహకం రూ.1.80 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఆ పార్టీ సహాయ కార్యదర్శులు పెద్యాట మారెప్ప, రంగన్న, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సమితి సభ్యుడు పెద్యాట శ్రీరంగ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై ఆర్టీసీ సిబ్బందికి అవగాహన

ఆదోని అర్బన్ : స్థానిక ఆర్టీసీ డిపోలో శుక్రవారం రోడ్డుభద్రతా వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. వచ్చే నెల 2వ తేదీ వరకు వారోత్సవాలు జరగనున్నాయి. స్థానిక ఆర్టీసీ డిపో గ్యారేజీలో ఆర్టీసీ జిల్లా అధికారి రజియాసుల్తానా, ట్రాఫిక్ సీఐ పార్థసారథి పాల్గొని ఆర్టీసీ డ్రైవర్‌లు, కార్మికులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ డ్రైవర్లు ఆరోగ్యసూత్రాలు పాటించాలని, మద్యం నడిపి వాహనాలను నడపరాదని సూచించారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానానికి చేర్చాల్సిన బాధ్యత మీపై ఉందని, అంతేగాకుండా తమ ఇంట్లో కుటుంబ సభ్యులను దృష్టిలో ఉంచుకుని వాహనాన్ని నడపాలని చెప్పారు. డిపో మేనేజర్ రఫిక్ అహ్మద్, గ్యారేజీ సిబ్బంది వేణుగోపాల్, రాఘవేంద్రప్రసాద్, రామలింగ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ పార్థసారథి

అంగన్‌వాడీ కేంద్రాల ఆకస్మిక తనిఖీ



పిల్లల కోసం వండిన ఆహారాన్ని పరిశీలిస్తున్న ఐసీడీఎస్ పీడీ కేఎల్ఆర్‌కే కుమారి

వెల్దుర్తి: పట్టణంలోని 5, 6, 8 అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ పీడీ కేఎల్ఆర్‌కే కుమారి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. టీచర్లు, హెల్పర్ల ద్వారా పిల్లలకు అందుతున్న బోధన, సేవలు, సౌకర్యాలు పరిశీలించారు. కోడిగుడ్లు, ఇతరత్రా వంట సామగ్రి, వండిన ఆహారం పరిశీలించి రిజిస్టర్లు తనిఖీ చేశారు. బాలింతలు, గర్భిణులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. పిల్లలు కూర్చునే ప్రాంతాల వద్ద వంట వండకుండా దూరంగా వండేలా ఏర్పాటు చేసుకోవాలని సిబ్బందిపై ఆగ్రహించారు. ఆమె వెంట సూపర్‌వైజర్ శోభారాణి ఉన్నారు.

వాల్మీకి అడుగుజాడల్లో నడవాలి

పెద్దకడబూరు : వాల్మీకిలందరూ మహర్షి అడుగుజాడల్లో నడవాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డి అన్నారు. మండలంని హెచ్.మురవణి గ్రామంలో వాల్మీకి మహర్షి విగ్రహాన్ని శుక్రవారం ప్రతిష్ఠించారు. కార్యక్రమానికి హాజరైన ఆయనకు వాల్మీకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.వాల్మీకి విగ్రహం ఎదుట పూర్ణాహుతి, శాంతిహోమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో మన ఇతిహాసాలు ఎంతో గొప్పవన్నారు. అలాంటి వాటిలో రామాయణాన్ని రాసిన వాల్మీకిని స్మరించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. రాష్ట్ర ఐక్య వాల్మీకి పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు బి.లక్ష్మన్న, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.



మాట్లాడుతున్న వై.ప్రదీప్‌రెడ్డి

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న గ్రామ పెద్దలు

మద్దికెర: మండల పరిధిలోని యడవలి గ్రామం జగనన్న కాలనీలో సుంకులమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారి ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించి విగ్రహానికి పూజలు చేశారు. ఈ సందర్భంగా పూజలకు విచ్చేసిన భక్తులకు అన్నదానం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు రామ్మోహన రెడ్డి, జెడ్పీటీసీ మురళీధర్ రెడ్డి, గ్రామస్తులు కృష్ణారెడ్డి, మాధవ రెడ్డి పాల్గొన్నారు.

యూజీసీ ముసాయిదాను వ్యతిరేకించాలి

ఆదోని రూరల్ : దేశంలో విదేశీ యూనివర్సిటీల ప్రవేశానికి అనుమతిస్తున్న యూజీసీ ముసాయిదాను వ్యతిరేకించాలని పీడీఎస్‌ఓ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మిగనూరు సర్కిల్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. సంఘం జిల్లా కన్వీనర్ తిరుమలేష్, డివిజన్ ప్రెసిడెంట్ ఖాదర్ మాట్లాడుతూ జాతీయ విద్యావిధానం-2020లో భాగంగా దేశంలోకి విదేశీ విశ్వవిద్యాలయాలు, విదేశీ ఉన్నత విద్యాసంస్థల ప్రవేశానికి అనుమతిస్తున్నట్లు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) చైర్మన్ ఎం.జగదీష్ కుమార్ జనవరి 5న ప్రకటించారన్నారు. విదేశీ విద్యాసంస్థలు వ్యాపార ప్రయోజనాలను ఆశిస్తాయని దీంతో పేద విద్యార్థులకు ఉన్నత విద్య దూరమయ్యే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యాపారం కోసమే ఆయా దేశాల యూనివర్సిటీలు వస్తాయని, దేశ విద్యార్థుల భవిష్యత్‌ను మెరుగుపరిచే ఉద్దేశ్యంతో కాదని చెప్పారు. పాఠ్య ప్రణాళిక, బోధన, పరీక్షా విధానం తదితర అంశాల్లో ప్రభుత్వ పాత్ర ఏమీ ఉండదని, వారు ఏకపక్షంగా వ్యవహరిస్తారని, దీంతో దేశంలోని యువత తీవ్రంగా నష్టపోతారన్నారు.నాయకులు రాజు, ఆది, ప్రవీణ్, కుమార్, నాగరాజు, వీరేష్ పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి

పెద్దకడబూరు : వలసలు వెళ్లకుండా ఉన్న గ్రామంలోనే ఎన్ఆర్ఈజీఎస్ ఆధ్వర్యంలో చేపట్టే ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని డీపీఓ టీ.నాగరాజు సూచించారు. మండలంలోని కల్లుకుంట, పెద్దకడబూరు గ్రామాల్లో శుక్రవారం ఉపాధి కూలీలు, ప్రజలతో ఎంపీడీఓ వెంకటరమణప్ప ఆధ్వర్యంలో గ్రామసభలు ఏర్పాటు చేసి వారితో చర్చించారు. వారు మాట్లాడుతూ కూలీలు మాట్లాడుతూ తమ కుటుంబ అవసరాల నిమిత్తం, కుటుంబ ఆదాయాన్ని పెంచుకోవడం కోసమే వలస వెళ్లుతున్నట్లు తెలిపారు. గుంటూరు వైపు పనులకు వెళ్తే ఒక జంటకు రోజుకు రూ.వెయ్యి చొప్పున ఇస్తారని, ఇలా మూడు నెలల్లో రూ. 90వేలు సంపాదిస్తామని చెప్పారు. హైదరాబాద్, బెంగళూరు వైపు వెళ్లితే ఇద్దరికి రోజుకు రూ.1400 ఇస్తారని పేర్కొన్నారు. ఇలా కుటుంబ ఆదాయాన్ని పెంచుకోవడం కోసమే ఏటా ఇలా వెళ్లామని వివరించారు. ఉపాధి వేతనాన్ని రూ. 300కు పెంచితే వలసలు వెళ్లకుండా ఉంటామని తెలిపారు. స్పందించిన డీపీఓ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఏపీఓ రామన్న, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న డీపీఓ టి.నాగరాజు

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో సత్తా

గోనెగండ్ల: ఇటీవల విజయనగరంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పెద్దనేలటూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని హేమలత సత్తా చాటింది. ఈ మేరకు శుక్రవారం ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చిన్న హుస్సేన్ మాట్లాడుతూ.. విజయనగరంలో ఈనెల 23, 24, 25 తేదీలలో నిర్వహించిన 66వ అండర్-17 రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో విద్యార్థిని హేమలత రన్నర్‌గా రాణించిందని తెలిపారు. ఈ సందర్భంగా హేమలతను ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు అభినందించారు.



కబడ్డీ పోటీల్లో సత్తా చాటిన విద్యార్థిని హేమలత

అధికారం కోసమే లోకేష్ పాదయాత్ర



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని అర్బన్ : లోకేష్ పాదయాత్ర కేవలం అధికారం కోసమే చేస్తున్నాడని, ప్రజల కోసం కాదని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. లోకేష్ పాదయాత్ర ఓ బూటకమని, ఎవరూ నమ్మరాదని కోరారు. లక్ష్యంలేని యువగళం యాత్ర అని, పాదయాత్ర వెనుక రాజకీయ దురుద్దేశం తప్ప మరొకటిలేదని ఆరోపించారు. ప్రజల సమస్యల కోసం చేసేది పాదయాత్ర అని, రాజకీయ దురుద్దేశాలతో చేయడం పాదయాత్ర అనిపించుకోదని చెప్పారు. ఇలా నిజమైన పాదయాత్ర చేసిన ఘనత వైఎస్సార్, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కిందని స్పష్టం చేశారు. వారు కేవలం ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు వేలాది కిలోమీటర్లు తిరిగారని, పదవుల కోసం కాదని తెలిపారు.

బుల్లితెరపై ఆణిముత్యం



న్యూ టెలెంట్-2022 బెస్ట్ యాక్టర్ అవార్డు అందుకుంటున్న రాజ్‌కుమార్

- సివిల్ ఇంజినీరింగ్ చదివి నటనపై ముక్కువతో సినీరంగ ప్రవేశం
- ప్రముఖ తెలుగు, కన్నడ టీవీ సీరియళ్లలో కీలక పాత్రల్లో నటన
- త్వరలో రాబోతున్న నాలుగు తెలుగు సినిమాల్లో అవకాశం
- సినీ రంగంలో ప్రతిభ చాటుతున్న కమ్మరచేడు యువకుడు రాజ్‌కుమార్

ఆలూరు రూరల్: పేద వ్యవసాయ కుటుంబంలో పుట్టి సివిల్ ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. రిలయన్స్, జిందాల్ స్టీల్ వంటి దిగ్గజ కంపెనీల నుంచి వచ్చిన ఉద్యోగాలను సైతం వద్దనుకున్నాడు. చిన్నతనం నుంచి నటనపై ఉన్న ఆసక్తి ఆ యువకుడిని బుల్లితెర వైపు నడిపించింది. పేదరికాన్ని జయించి.. బుల్లితెరపై మెరిసే అవకాశాన్ని సంపాదించుకున్నాడు. 2016 నుంచి టీవీ సీరియళ్ల డైరెక్టర్ సుమన్‌బాబు అవకాశం ఇవ్వడంతో బుల్లెతెరపై ఎంట్రీ ఇచ్చాడు. త్వరలో రాబోతున్న రెండు తెలుగు సినిమాల్లో నటించే అవకాశం సంపాదించుకున్నాడు. కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దల సహకారంతో సినీ రంగంలో రాణిస్తున్న ఆలూరు మండలం కమ్మరచేడు గ్రామానికి చెందిన యువకుడు రాజ్‌కుమార్.

కమ్మరచేడు గ్రామానికి చెందిన రామాంజినేయులు, జలజాక్షి దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుర్లు సంతానం. వీరి రెండో కుమారుడు రాజ్‌కుమార్. తమకున్న పదెకరాల వ్యవసాయ భూమి సాగు చేసుకుంటూ ఆ కుటుంబం జీవనం సాగిస్తోంది. కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంలోని ఆలూరు మండలం కమ్మరచేడు అనే మారుమూల గ్రామంలోని పుట్టి పెరిగి బుల్లితెరపై మెరుస్తున్న గ్రామీణ ఆణిముత్యం సహాయ నటుడు రాజ్‌కుమార్‌పై ప్రత్యేక కథనం.

సీరియళ్లలో కీలక పాత్రల్లో అభినయం

మా టీవీ, జీ తెలుగు, జెమిని టీవీ, ఈటీవీల్లో ప్రసారమయ్యే మనసు మమత, స్వాతి చినుకులు, పవిత్ర బంధం, గంగా–మంగా, మేనకోడళ్లు సీరియళ్లలో క్యారెక్టర్ ఆర్టిస్ట్(సహాయ నటుడు)గా వందల ఎపిసోడ్లు పూర్తి చేసుకున్నాడు రాజ్‌కుమార్. ఇందులో కొన్ని సీరియళ్లు ముగిశాయి. ఈ ఏడాది నుంచి భక్తి టీవీలో ప్రసారమయ్యే దుర్గమ్మ అనే మెగా సీరియల్‌లో విలన్ పాత్ర కోసం 30 ఎపీసోడ్‌లు పూర్తి చేశాడు. సీరియల్ పూర్తయ్యే వరకు ఇందులో నటించనున్నాడు. ఈ సీరియల్ ఈ ఏడాది మే నెల నుంచి బుల్లితెరపైకి రానుంది. అలాగే కన్నడ భాషలోని కగ్గల్, శ్రీరామ అల్ల శ్రీ కృష్ణ వంటి సీరియళ్లలో నటించాడు. కన్నడ సినీరంగంలో వచ్చే అవకాశాలను సైతం సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగుతున్నాడు. అలాగే ఈ ఏడాది సుమన్‌బాబు బ్యానర్‌లో రాబోతున్న గిద్దలూరు పోలీస్‌స్టేషన్, అమ్మ నాన్న మధ్యలో మధురవాణి వంటి సినిమాల్లో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా నటించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. అలాగే డైరెక్టర్ వినయ్ బాబు దర్శకత్వంతో రెండు సినిమాల్లో నటించే అవకాశం లభించింది.



దుర్గమ్మ సీరియల్ షూటింగ్‌లో రాజ్‌కుమార్

న్యూ టాలెంట్–2022 బెస్ట్ యాక్టర్ అవార్డు

ప్రముఖ టీవీ సీరియళ్లలో నటిస్తూ మంచి పేరు సంపాదించుకున్నాడు నటుడు రాజ్ కుమార్. ఈయన ప్రతిభను గుర్తించి రుద్ర స్టూడియోస్ అనే హైదరాబాద్‌కు చెందిన సంస్థ న్యూ ట్యాలెంట్ 2022 అవార్డుకు ఎంపిక చేసి ఈ నెల 22వ తేదీ హైదరాబాద్‌లో ప్రత్యేక ఈవెంట్ ఏర్పాటు అవార్డును ప్రదానం చేసింది.

ప్రముఖ సినీ బ్యానర్‌లో నటించాలన్నదే ఆశయం

సినీ దర్శకుడు సముద్ర, వి.సుమన్ గారి సహకారంతో ప్రముఖ టీవీ ఛానళ్లలో వచ్చే సీరియళ్లలో నటించాను. ఇప్పటి వరకు వందలాది ఎపీసోడ్‌లలో నటించి మెప్పించాను. ప్రస్తుతం తెలుగు, కన్నడ సినిమాలు, సీరియళ్లలో నటించేందుకు అవకాశం వచ్చింది. ఇందులో నటించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాను. మైత్రీ మూవీస్, దిల్ రాజు, సూపర్ గుడ్ ఫిలిమ్స్, వారాహి, కన్నడలో హొంబలే వంటి ప్రముఖ బ్యానర్లలో నటించాలన్నదే నా ఆశయం.

– రాజ్‌కుమార్, సహాయ నటుడు